

జిల్లాలో 513 టీచర్ పోస్టులు ఖాళీ

- త్వరలోనే భర్తీ
- డీఈవో వెంకటలక్ష్మమ్మ

... 7వ పేజీలో



పోలవరం ఎడమ కాలువ దశ తిరిగేనా?

నేడు దార్లపూడిలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు



- పడకేసిన ఎడమ కాలువ, అక్విడెక్టు పనుల పరిశీలన
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పనులు, అర్థాంతరంగా నిలిచిపోయిన అక్విడెక్టును పరిశీలించనున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పడకేసిన ఈ పనులను పరుగులు పెట్టించనున్నారు. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో రూ.677 కోట్ల అంచనా వ్యయంతో 84 కిలోమీటర్ల పొడవున 2005లో పోలవరం ఎడమ కాలువ పనులు ప్రారంభించారు. భూసేకరణ పనులు పూర్తిచేసి ప్రధాన కాలువను 6, 7, 8 మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. జిల్లాలో పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం దార్లపూడి వరకు ఆరో ప్యాకేజీ కింద రూ.196 కోట్ల వ్యయంతో సుమారు 25 కిలోమీటర్ల పొడవున ఎడమ కాలువ తవ్వకం పనులు చేపట్టారు. దాదాపు మట్టి తవ్వకం పనులు పూర్తయినా మధ్యలో వంతెనలు, కాంక్రీట్ లైనింగ్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తాండవ నదిపై నిర్మాణంలో వున్న కాలువ పనులు అరకొరగానే సాగాయి. కొన్నిచోట్ల కాలువ ఎగువ గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్లు వేయకుండా వదిలేశారు.

అటకెక్కిన అక్విడెక్టు పనులు....


ఎస్.రాయవరం మండలం దార్లపూడి నుంచి అనకాపల్లి మండలం తాళ్లపాలెం వరకు 7వ ప్యాకేజీ కింద రూ.330 కోట్ల అంచనా వ్యయంతో 28 కిలోమీటర్ల పొడవున ఎడమ కాలువ పనులు ప్రారంభించినా ఆ పనులు అంతంతంగానే సాగాయి. వరహా నదిపై నిర్మించతలపెట్టిన సిమెంట్ కాలువ పనులు పూర్తి కాలేదు. కొండవాలు ప్రాంతాల నుంచి జాలువారే నీరు ప్రవహించేందుకు నిర్మించాలనుకున్న కాలువ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పలుచోట్ల కాలువ చుట్టూ వేసిన కాంక్రీటు లైనింగ్ పనులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఎడమ కాలువలో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారింది.

8వ ప్యాకేజీ పనులు అంతంత మాత్రమే..

తాళ్లపాలెం నుంచి కణితి రిజర్వాయర్ వరకు 8వ ప్యాకేజీ పనులను రూ.171 కోట్ల అంచనాలతో ప్రారంభించారు. సుమారు 33 కిలోమీటర్ల పొడవున ప్రస్తుతం ఉన్న ఏలేరు కాలువను వెడల్పు చేసి పోలవరం కాలువకు అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. ఏలేరు కాలువకు రెండు వైపులా మట్టి తొలగించి కాలువ వెడల్పు పనులు చేపట్టారు. ఈ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో వెడల్పు చేసిన కాలువ ప్రాంతాలకు మళ్లీ మట్టి చేరి చాలాచోట్ల కాలువ పూడుకుపోయింది.

బిల్లులు చెల్లించని జగన్ ప్రభుత్వం

వైసీపీ ఐదేళ్ల పాలనలో అక్విడెక్టు నిర్మాణ పనులు మూలకు చేరిపోగా, కాలువ నిర్మాణాలకు కనీసం నిధులు విడుదల కాలేదు. పోలవరం ఎడమ కాలువ పనులకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా జాప్యం చేస్తూ వచ్చింది. మూడు ప్యాకేజీల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని ... మిగతా 8వ పేజీలో



నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక

తొలుత అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన

- అక్కడ నుంచి భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు...
- అనంతరం మెడ్‌టెక్ జోన్‌లో కార్యక్రమాలకు హాజరు
- ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.15 గంటలకు రోడ్డుమార్గాన ... మిగతా 8వ పేజీలో

బాబుపైనే ఆశలు

వైసీపీ పాలనలో జిల్లాలో అన్ని రంగాలూ నిర్వీర్యం

- మూతపడిన సహకార చక్కెర కర్మాగారాలు
- నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వనరులు
- పడకేసిన సుజల స్రవంతి పనులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో కూడా అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయి. సాగునీటి వనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. అభివృద్ధి పడకేసింది. కూటమి ప్రభుత్వం రావడంతో అన్ని రంగాలు గాడిన పడతాయన్న ఆశ అందరిలో ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి గ్రామానికి వస్తున్నందున ఆయన దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లాలని కూటమి నేతలు భావిస్తున్నారు. చంద్రబాబు రాకతో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జలాశయాలపై నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో జిల్లాలో రైతులకు తీరని అన్యాయం చేసింది. ప్రధాన సాగునీటి వనరులైన పెద్దేరు, రైవాడ, తాండవ జలాశయాల ఆధునికీకరణ పనులను గత ఐదేళ్లుగా చేపట్టలేదు. ప్రతి ఏడాది వీటి కోసం జల వనరుల శాఖ ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదు. పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల పరిధిలో పంట కాలువల మరమ్మతు పనులు సైతం చేపట్టలేదు. దీంతో శివారు ప్రాంతాల పంటలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల పరిధిలోని శారదా నది గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క గ్రోయిన్‌కు కూడా మరమ్మతులు చేపట్టలేదు.



అనకాపల్లిలో మూత పడిన తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ

ముందుకు కదలని సుజల స్రవంతి పనులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు వైసీపీ ఐదేళ్ల పాలనలో అడుగు కదల్లేదు. ప్రతి ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు జరుపుతున్నా ప్రభుత్వం నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో ఈ పథకం పనుల కోసం భూసేకరణ కూడా పూర్తిస్థాయిలో జరపలేకపోయారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకం పనులు పూర్తిచేసేందుకు అనకాపల్లిలో ప్రత్యేకంగా ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించినా నిధులు లేక పనులు ముందుకు సాగలేదు.

జాడలేని ఫిషింగ్ హార్బర్, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఫిషింగ్ హార్బర్, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఐదేళ్లలో జాడ లేకుండా పోయాయి. ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ పనులు చేపడుతున్నట్టు వైసీపీ ప్రభుత్వం విస్తృత ప్రచారం చేసుకుంది. ఐదేళ్లలో కేవలం భూసేకరణ జరిపి, పనులు మాత్రం ఇంకా ప్రారంభించలేదు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం రాజయ్యపేట, దొండవాక మత్స్యకార గ్రామాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ప్రారంభిస్తామని వైసీపీ ప్రభుత్వం హడావిడి చేసింది. అధికారులు డీపీఆర్ సమర్పించి ఐదేళ్లు గడిచిపోయినా పనుల జాడ మాత్రం లేదు.

మూత పడిన షుగర్ ఫ్యాక్టరీలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార షుగర్ ఫ్యాక్టరీలు దివాలా దిశగా పయనించాయి. అనకాపల్లి వీవీ రమణ సహకార షుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టారు. ఎన్నికల ముందు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ పాలకులలు గత ఐదేళ్లలో షుగర్ ఫ్యాక్టరీల గురించి పట్టించుకోలేదు. ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ప్రస్తుతం సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జిల్లాలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా వాసులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రాంకీలో ఇంటిదొంగలు

ఫార్మా వ్యర్థాలను బయటకు తరలించడంలో కొందరు ఉద్యోగుల కీలకపాత్ర

- నాలుగు చెక్‌పోస్టులను దాటించి బయటకు..
- బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ ఫార్మా వ్యర్థాలు
- పీసీబీ అధికారుల తీరుపై అనుమానాలు



సింహాద్రి జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు

పరవాడ, జూలై 10:

ఫార్మా రసాయన వ్యర్థాలు ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. ఫార్మా సిటీ లోపలి నుంచి బయటకు తరలించడానికి వీలు లేకుండా రాంకీ యాజమాన్యం ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టులను దాటుకుని రసాయన వ్యర్థాలతో వాహనాలు వెళ్లిపోతున్నాయి. దీని వెనుక రాంకీ సంస్థలోని కొందరు ఉద్యోగుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫార్మాసిటీలో సుమారు 100కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో కొన్ని పరిశ్రమలు ఫార్మా ఉత్పత్తుల తయారీ అనంతరం వచ్చే వ్యర్థాలను రాంకీ యాజమాన్యం నిర్వహిస్తున్న సీఈటీపీ(కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కి అప్పగించాలి. అనంతరం వ్యర్థాలను శుద్ధి చేసి పైపులైన్ మార్గం ద్వారా తిక్కవానిపాలెం వద్ద సముద్రంలో విడిచిపెట్టాలి. దీని కోసం నిర్ణీత మొత్తాన్ని రాంకీ యాజమాన్యం సదరు కంపెనీల నుంచి వసూలు చేస్తుంది. అదేవిధంగా ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను నేరుగా బయటకు విడుదల చేయకూడదు. అయితే ఈ నిబంధనలను ఫార్మా యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. రాత్రి వేళల్లో రసాయన వ్యర్థాలను నేరుగా డ్రైనేజీ ల ద్వారా బయట ఉన్న గెడ్డలోకి విడిచిపెడుతున్నాయి. ఘన వ్యర్థాలను మాత్రం వ్యాన్లు, లారీల ద్వారా బయట ప్రదేశాల్లో విడిచిపెడుతున్నాయి. వాస్తవానికి ఫార్మాసిటీ లోపల నుంచి పూచికపుల్ల కూడా బయటకు వెళ్లకుండా ఫార్మాసిటీ చుట్టూ నాలుగుచోట్ల రాంకీ యాజమాన్యం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఫార్మాసిటీ లోపల నుంచి బయటకు ఏ వస్తువు వెళ్లినా సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే బయటకు వదులుతారు. సెక్యూరిటీ అంత పకడ్బందీగా ఉన్నప్పటికీ ఫార్మా ఘన వ్యర్థ రసాయనాలు ఇటీవల యథేచ్ఛగా బయటకు పోతున్నాయి. ఈ వ్యవహారంలో రాంకీలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు ఫార్మా యాజమాన్యాలతో రాంకీకి చెందిన కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కై ఘన రసాయన వ్యర్థాలను బయటకు తరలించడంలో సాయపడుతున్నా రన్న ఆరోపణలు ఉన్నాయి. ఫార్మా యాజమాన్యాలు ఘన వ్యర్థాలతో పాటు ద్రవ వ్యర్థాలను రాంకీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అప్పగించాలి. ఇందుకోసం రాంకీ యాజమాన్యానికి కొంత నగదు కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇదంతా పెద్ద ఖర్చుతో కూడుకున్న పని కావడంతో నేరుగా బయటకే బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నారు. దీంతో పరవాడ పరిసర ప్రాంతాలన్నీ ఫార్మా వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

చోద్యం చూస్తున్న పీసీబీ అధికారులు

ఫార్మాసిటీ నుంచి విచ్చలవిడిగా ఘన, ద్రవ రసాయన వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో ... మిగతా 8వ పేజీలో

చంద్రబాబుకు స్వాగత ఏర్పాట్లు



దార్లపూడి అక్విడెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఉత్తరాంధ్ర జిల్లాలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ కేవీ మురళీకృష్ణ.. చంద్రబాబు సందర్శించనున్న ఎస్.రాయవరం మండలం దార్లపూడి అక్విడెక్టు ప్రాంతాన్ని ఇప్పటికే పరిశీలించి స్వాగత ఏర్పాట్లను పర్యవేక్షించారు. దార్లపూడిలో హెలిప్యాడ్ పనులను అధికారులు పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడి వద్ద అసంపూర్తిగా ఉన్న అక్విడెక్టును పరిశీలించడానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు రానుండడంతో సీఎం పర్యటించే ప్రాంతాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణతో బుధవారం పరిశీలించారు. చంద్రబాబు పరిశీలించనున్న అక్విడెక్టు వద్ద ఏర్పాట్లను, ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ ప్రదేశాన్ని, మీడియా పాయింట్‌ను అనిత పరిశీలించడమే కాకుండా బారికేడ్లతో పాటు తదితర ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇంజక్షన్... రియాక్షన్

నక్కపల్లి ఆస్పత్రిలో 23 మందికి అస్వస్థత

డ్యూటీ డాక్టర్ అప్రమత్తం కావడంతో తప్పిన ప్రమాదం



రియాక్షన్ ఇచ్చిన ఇంజక్షన్ సిఫోటాక్జిమ్

- అనంతరం అనకాపల్లిలోని జిల్లా ఆస్పత్రికి తరలింపు

నక్కపల్లి, జూలై 10:

అనకాపల్లి జిల్లా నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులకు మంగళవారం రాత్రి సిబ్బంది ఇచ్చిన ఇంజక్షన్లు వికటించాయి. సుమారు 23 మందికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అవ్వడంతో డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి గుర్తించి నిమిషాల వ్యవధిలో ఎవిల్, డెక్‌డ్రాన్ ఇంజక్షన్లు ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం అందరినీప్రత్యేక అంబులెన్స్‌ల్లో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా వుందని నక్కపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష చెప్పారు.



అనకాపల్లి ఆస్పత్రిలో బాధితులు

నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలోని జనరల్ వార్డులో మంగళవారం రాత్రి సుమారు 30 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. యథావిధిగా జ్వరం, నీరసం తగ్గేందుకు సిబ్బంది యాంటీ బయాటిక్ ఇంజక్షన్ సిఫోటాక్జిమ్ సహా మెట్రోజిల్, సిప్రోఫ్లాక్సిన్ ఇచ్చారు. ఇంజక్షన్లు చేసిన వెంటనే మొదట ఆరుగురికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అయ్యాయి. ఆ తరువాత కాసేపటికి మిగిలిన రోగులలో కూడా ఈ లక్షణాలు కన్పించాయి. సిఫోటాక్జిమ్ ఇంజక్షన్ వల్లే రియాక్షన్ వచ్చినట్టు ప్రాథమికంగా వైద్యాధికారులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పలువురు నాయకులు నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే హోం మంత్రి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించి, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రియాక్షన్ నుంచి రోగులను కాపాడేందుకు ఎవిల్, డెక్‌డ్రాన్ ఇంజక్షన్లు చేసిన అనంతరం హెటిరో సహా ఇతర అంబులెన్స్‌ల్లో రోగులను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇతర వ్యాధుల తీవ్రతతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన బుచ్చిరాజుపేటకు చెందిన సింహాద్రి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా వుండడంతో అనకాపల్లి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యాధికారులు ... మిగతా 8వ పేజీలో

వెంకన్న ఆలయంలో పట్టపగలు చోరీ

- హుండీ పగులగొట్టి కానుకల అపహరణ

- వార్త 7వ పేజీలో..

50,66,616

ఇదీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జనాభా సంఖ్య

- గత ఏడాదిలో 54,658 మంది పెరుగుదల
- విభజిత విశాఖ జిల్లా జనాభా 23,85,658
- అనకాపల్లి జిల్లా...17,26,998
- అల్లూరి సీతారామరాజు జిల్లా... 9,53,960



విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి):

జిల్లా జనాభా పెరుగుతోంది. గడిచిన ఏడాదితో పోలిస్తే 2.32 శాతం మేర పెరుగుదల నమోదైనట్టు ఏయూలోని జనాభా అధ్యయన కేంద్రం అధికారులు అంచనా వేశారు. గురువారం అంతర్జాతీయ జనాభా దినోత్సవం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా జనాభాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జనాభా 42,90,589 కాగా, ప్రస్తుతం 50,66,616 (విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు కలిపి). అంటే, గడిచిన 14 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో జనాభా సుమారు ఎనిమిది లక్షల మేర పెరిగింది. విభజిత విశాఖ జిల్లా విషయానికి వస్తే గడిచిన ఏడాది 23,31,000 మంది జనాభా ఉండగా ఈ ఏడాదికి ఆ సంఖ్య 23,85,658కి చేరింది. అంటే ఏడాదిలో 54,658 మంది (2.32 శాతం గ్రోత్ రేటు) పెరిగారు. జనాభా రీత్యా రాష్ట్రంలో అతి పెద్ద నగరాల్లో విశాఖపట్నం ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం విభజిత విశాఖ జనాభా మొత్తాన్ని అర్బన్ పాపులేషన్‌గా అంచనా వేశారు. ఇక, అనకాపల్లి జిల్లాలో గడిచిన ఏడాది 17,21,472 మంది ఉండగా ప్రస్తుతం 17,26,998 మంది ఉన్నారు. ఏడాదిలో 5,526 మంది (0.32 శాతం గ్రోత్ రేట్) పెరిగారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో గడిచిన ఏడాది 9,50,812 మంది ఉండగా, ఈ ఏడాది 9,53,960 మంది ఉన్నారు. ఏడాదిలో 3,148 మంది (0.33 గ్రోత్ రేట్) పెరిగారు. మూడు జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా చూస్తే గడిచిన ఏడాది 50,03,284 మంది జనాభా ఉండగా, ఈ ఏడాదిలో 50,66,616కు (63,332 మంది పెరిగారు) చేరారు. ఏయూలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌లో రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్‌గా డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ వై.రమణ, రీసెర్చ్ ఫెలోస్ డాక్టర్ సీహెచ్ పాదాలు, డాక్టర్ శ్రీనివాస్ పని చేశారు.

వేగంగా అర్బనైజేషన్



ఏటా జనాభా భారీగా పెరుగుతోంది. 2011 లెక్కలను ప్రామాణికంగా తీసుకుని ఏటా జనాభా పెరుగుదలను అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా దేశంలో అర్బనైజేషన్ వేగంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పనపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రస్తుతం దేశంలో 36.3 శాతం అర్బన్ పాపులేషన్ ఉంది. రానున్న పదేళ్లలో భారీగా పెరగవచ్చు. రోడ్లు, ఇళ్లు, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఉంది. లేకపోతే అనేక రకాల ఇబ్బందులు తలెత్తవచ్చు.

- ప్రొఫెసర్ బి.మునిస్వామి, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్

క్రైం... crime news

విద్యుదాఘాతంలో కుక్ మృతి


కుల్‌దీప్ సింగ్ మృతదేహం

అచ్యుతాపురం, జూలై 10: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి సీఐ బుచ్చిరాజు తెలిపిన వివరాలివి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫిరోజాబాద్‌కు చెందిన కులదీప్ సింగ్ (23) సెజ్‌లో గల ఓ కర్మాగారంలో అసిస్టెంట్ కుక్‌గా పనిచేస్తున్నాడు. దిబ్బపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో గల ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం రెండవ అంతస్థులో గోడపై కూర్చొనగా పక్కనే గల విద్యుత్ వైర్లు చేతికి తగలడంతో షాక్ గురయ్యాడు. వెంటనే అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందినట్టు సీఐ వివరించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వెంకన్న ఆలయంలో పట్టపగలు చోరీ

▸ హుండీ పగులగొట్టి కానుకల అపహరణ


ఆలయంలోని హుండీ

నర్సీపట్నం, జూలై 10: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పట్టపగలు చోరీ జరిగింది. హుండీ తాళాన్ని దొంగ పగులగొట్టి అందులోని కానుకలను అపహరించాడు. దీనికి సంబంధించి ఆలయ ఈవో కె.దివ్యతేజ బుధవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పూజారి, సిబ్బంది గుడికి తాళాలు వేసి భోజనానికి వెళ్లారు. తిరిగి 5 గంటలకు వచ్చే సరికి మండపం గేటు, హుండీ తాళం పగులగొట్టి ఉన్నాయి. హుండీ తలుపు తెరిచి ఉంది. హుండీ దగ్గరలో కట్టింగ్ ప్లేయర్ ఉంది. ఆలయ ఈవో దివ్యతేజ చోరీ విషయాన్ని మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం క్లూజ్ టీమ్ సిబ్బంది గుడిలో వేలిముద్రలు సేకరించారు. ఆలయం తూర్పు ద్వారం తలుపులు వేసినవి వేసినట్టే ఉండడంతో దొంగ గోడ దూకి లోపలికి ప్రవేశించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గుడిలో మొత్తం ఐదు హుండీలు ఉండగా మండపంలోని హుండీ తెరిచాడు. మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అదను చూసుకొని దొంగ గుడిలోకి ప్రవేశించి, వెనుక భాగంలో ఉన్న సీసీ కెమెరాలు స్విచ్ ఆఫ్ చేశాడు. గుడి గురించి బాగా తెలిసిన వ్యక్తి చేసిన పనే అని అధికారులు భావిస్తున్నారు. అయితే తెరిచి ఉన్న హుండీలో చిల్లర నాణెలు, నోట్లు ఉండడంతో ఈవో ఆధ్వర్యంలో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి సభ్యుడు తాటికొండ బ్రహ్మలింగస్వామి, సూపర్‌వైజర్లు బి.శ్రీనివాసరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, పోలీసులు, భక్తుల సమక్షంలో వాటిని లెక్కించారు. రూ.59,306 నగదు ఉన్నట్టు నిర్ధారించారు. హుండీలో ఎంత నగదు, కానుకలు అపహరణకు గురయ్యాయో చెప్పలేమని ఈవో తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నాతవరం, జూలై 10: గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వల్లంపేట జంక్షన్‌లో రెండు కిలోల గంజాయితో ఉన్న పి.సుమన్, జి.బుచ్చిబాబులను మంగళవారం సాయంకాలం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరూ విజయవాడకు చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

అనకాపల్లి టౌన్, జూలై 10: మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున రూ.2.5 లక్షలు జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి టీవీ విజయలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్టు ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. పట్టణంలోని పలుచోట్ల సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేయగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 25 మంది పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చినట్టు చెప్పారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనచోదకులు 63 మంది పై కేసులు నమోదు చేసి రూ.6,800 జరిమానాలు విధించామని వివరించారు.

వడ్డిప గ్రామ శివారున 12 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ, ఎస్సై తదితరులు

రోలుగుంట, జూలై 10: మండలంలోని వడ్డిప శివారున బుధవారం 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. సీఐ అప్పలనాయుడు, ఎస్సై సురేష్ అందించిన వివరాల ప్రకారం.. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేసుండగా, రత్నంపేట నుంచి వడ్డిప వైపు వస్తున్న ఆటోను ఆపారు. అందులో 12 కేజీల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధం ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు ముగ్గురు జి.మాడుగుల, చింతపల్లి మండలాలకు, మరో ముగ్గురు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరు చింతపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తునికి చేర్చడానికి ఆటోను బుక్ చేసుకుని వెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

చోరీకి గురైన సెల్ ఫోన్లు స్వాధీనం


తుని రైల్వే పోలీసులు రికవరీ చేసిన ఫోన్లతో బాధితులు

పాయకరావుపేట, జూలై 10: రైలు ప్రయాణికుల నుంచి చోరీకి గురైన సెల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్న తుని రైల్వే పోలీసులు బుధవారం వాటిని ఆయా యజమానులకు అందజేశారు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. తుని, నర్సీపట్నం రోడ్డు, ఎలమంచిలి రైల్వే స్టేషన్ల ప్లాట్‌ఫారంలలో, రైళ్లలో ప్రయాణం చేస్తూ సెల్ ఫోన్లు పోగొట్టుకున్న తుని, పాయకరావుపేటలకు చెందిన పలువురు తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదులు చేశారు. వీటిపై ప్రత్యేక దృష్టిసారించిన రైల్వే పోలీసులు సీఈఐఆర్ సైట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని ఆయా యజమానులకు అందజేత కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, హెచ్‌సీ రవి, రామకోటి, బెహరా ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 10: విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే 12740 నంబరు గల రైలుకు ఈనెల 22వ తేదీ నుంచి విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే 12739 నంబరు గల రైలుకు ఈనెల 23వ తేదీ నుంచి ఈ కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ సర్వీసులు 18 థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు, రెండు జనరేటర్ మోటార్స్ కోచ్‌లతో రాకపోకలు సాగిస్తాయన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

కోలుకున్న బాధితులు

▸ నక్కపల్లి ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 23 మందికి అస్వస్థత
▸ ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలింపు


సిపిటాక్జిమ్ ఇంజక్షన్ల స్టాక్‌ను పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కల్యాణి

అనకాపల్లి టౌన్, జూలై 10: నక్కపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం రాత్రి వైద్య సిబ్బంది ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో తీవ్ర అస్వస్థతకు గురైన 23 మందికి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో మెరుగైన వైద్యసేవలందడంతో బుధవారం కోలుకున్నారు. నక్కపల్లి మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు వ్యాధి నివారణ కోసం ఆస్పత్రిలో చేరారు. అయితే మంగళవారం రాత్రి రోగులకు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో ఒక్కసారిగా పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడగా, మరికొందరు వణికిపోతూ ఇబ్బందులు పడ్డారు. దీంతో నక్కపల్లి ఆస్పత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి సమయంలో 23 మందిని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అప్పటికే సమాచారం అందుకున్న ఎన్టీఆర్ వైద్యాలయం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వైద్యులను అప్రమత్తం చేశారు. వైద్యాలయానికి వచ్చిన 23 మందికి ముగ్గురు డాక్టర్ల బృందం తమ సిబ్బందితో మెరుగైన వైద్యం అందించారు. వీరిలో కె.సింహాద్రి అనే వ్యక్తి పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై ఇన్‌చార్జి డీసీహెచ్ డాక్టర్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ నక్కపల్లి ఆస్పత్రిలో రోగులకు ఉదయం, మధ్యాహ్నం ఇంజక్షన్లు ఇచ్చారని, దీని వల్ల ఎటువంటి అపాయం జరగలేదన్నారు. రాత్రి ఇచ్చిన ఇంజక్షన్ వల్ల రోగులు అస్వస్థతకు గురయ్యారని, ఇక్కడ మెరుగైన వైద్యసేవలందించడంతో బుధవారం తెల్లవారేసరికి వారంతా కోలుకున్నారని తెలిపారు. అయితే నక్కపల్లిలో ఇచ్చిన ఇంజక్షన్‌లను పరిశీలించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించామని, వారు శాంపిల్స్ తీసి నివేదిక ఇచ్చిన తరువాత డ్రగ్‌లో నాణ్యత లోపిస్తే ఆ బ్యాచ్ మందులను వినియోగించకుండా నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోగుల పరిస్థితిపై హోంశాఖ మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఫోన్ చేసి అడుగగా అందరూ క్షేమంగా ఉన్నారని సమాచారమిచ్చినట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పిల్లలకు పచ్చకామెర్లు ప్రభావం ఉండడంతో వారు మాత్రం వైద్యం పొందుతున్నారని, మిగిలిన వారంతా డిశ్చార్జి అయ్యారని ఆయన చెప్పారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 23 మంది రోగులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో బుధవారం ఉదయం కలెక్టర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కల్యాణి, డ్రగ్ సప్లయి యూనిట్ ప్రతినిధుల బృందం నక్కపల్లి ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి డ్రగ్ స్టోర్‌లో వున్న మందులను పరిశీలించారు. రియాక్షన్ వచ్చిందని భావిస్తున్న సిపిటాక్జిమ్ ఇంజక్షన్ల బాక్సులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. వీటికి ఎక్స్‌పెయిరీ డేట్ వున్నట్టుగానే గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా ఈ ఇంజక్షన్లు ఇక ఎవరికీ చేయవద్దని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వున్న సిపిటాక్జిమ్ ఇంజక్షన్లను సీజ్ చేస్తున్నట్టు ఆమె చెప్పారు.

బాలిక హత్య కేసు నిందితుడ్ని అరెస్టు చేయాలి

▸ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
▸ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర


నిందితుడిని శిక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని పరవాడ డీఎస్పీ సత్యనారాయణకు అందజేస్తున్న ఎమ్మెల్సీ, జడ్పీటీసీలు

రాంబిల్లి, జూలై 10 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర బుధవారం పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి తెలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. బాలిక తల్లిదండ్రులు నిందితుడు సురేశ్ నుంచి ముప్పు ఉందని చెప్పినా పోలీసులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిందితుడ్ని వెంటనే పట్టుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, రూ.ఇరవై లక్షల పరిహారం చెల్లించాలని, బాలిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు రాంబిల్లి పోలీస్ స్టేషన్‌కు నల్లబ్యాడ్జీలు ధరించి వెళ్లారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణను కలిసి బాలిక హత్య కేసు నిందితుడ్ని పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖకు ఉక్కు మంత్రి

నేడు స్టీల్‌ప్లాంటు సందర్శన


కేంద్ర మంత్రులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు పల్లా శ్రీనివాస్ తదితరులు

విశాఖపట్నం, జూలై 10 : కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం విశాఖపట్నం వచ్చారు. డిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి ఆర్ఐఎన్ఎల్ గెస్ట్ హౌస్‌కు వెళ్లి బస చేశారు.

గురువారం ఉదయం తొమ్మిది గంటలకు స్టీల్‌ప్లాంటును సందర్శించి, అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

లక్ష్యంతో న్యాయ విద్యను కొనసాగించాలి

▸ విద్యార్థులకు నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్ కేశవరావు సూచన


ప్రొఫెసర్ కేశవరావును సత్కరిస్తున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, జూలై 10: న్యాయ విశ్వవిద్యాలయాల్లో చేరే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్, డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.కేశవరావు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాశరావు అధ్యక్షతన మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో న్యాయ విద్య ఎంతో భిన్నమైన దన్నారు. మూట్ కోర్టులలో పాల్గొనడం, ప్రాజెక్టులు, డిబేట్‌లతో పాటు వివిధ అభ్యాసనాల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అంతకు ముందు వీసీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో, అనంతరం రాజ్యాంగం తయారీలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారన్నారు. సమాజానికి ఉపయుక్తమైన న్యాయవాదులుగా తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, ఇతర అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో జగన్నాథుడు


నరసింహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 10: పట్టణంలోని ఇంద్రద్యుమ్న హాలులో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి బుధవారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, విశేష పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లాలో 513 టీచర్ పోస్టులు ఖాళీ

▸ త్వరలోనే భర్తీ ▸ డీఈవో వెంకటలక్ష్మమ్మ


చెమ్మచింత హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న డీఈవో

నాతవరం, జూలై 10: జిల్లాలో జిల్లాలో 513 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని త్వరలో భర్తీ చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆమె నాతవరం మండలంలోని పలు పాఠశాలలు సందర్శించి మధ్యాహ్నం భోజనం అమలు, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని నాతవరం, అచ్యుతాపురం, ఎస్.రాయవరంలో జూనియర్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయన్నారు. గత ఏడాది కూండ్రం, యలమంచిలి, పాయకరావుపేట, పరవాడలో జూనియర్ కళాశాలలు వచ్చాయన్నారు. అలాగే ఫేజ్-1, ఫేజ్-2 ల్లో పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చమ్మచింత గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామని, నివేదిక ఉన్నతాధికారులకు అందించామన్నారు.

అంతకుముందు డీఈవో చమ్మచింత హైస్కూల్‌కు వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించేందుకు సూచనలు, సలహాలు అందించారు. నోటు పుస్తకాలను పరిశీలించారు. రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, చమ్మచింత హైస్కూల్ ప్రదానోపాధ్యాయులు కె.శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరాటంకంగా ఇసుక అక్రమ రవాణా


ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇసుక

మాకవరపాలెం, జూలై 10: కొత్త ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రారంభించినప్పటికీ మండలంలో అక్రమ ఇసుక వ్యాపారం యథావిధిగా కొనసాగుతోంది. మండలంలో ప్రతీ రోజూ తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ ఈ అక్రమ ఇసుక వ్యాపారం సాగుతుంది. అయితే ఈ ఇసుక తరలింపు స్థానిక పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే జరుగుతుండడం గమనార్హం. ప్రస్తుతం మండలంలో టైరుబండి ఇసుక లోడు రూ.1200, ట్రాక్టరు లోడు రూ.4 వేల చొప్పున అమ్మకాలు జరుగుతున్నాయి. టైరు బండ్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్న అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉచిత ఇసుక విధానం వచ్చినప్పటికీ భవన నిర్మాణదారులకు మాత్రం ఇసుక అంత సులభంగా లభ్యం కావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా తేలికపాటి జల్లులు

అనకాపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం తేలికపాటి జల్లులు కురిశాయి. వర్షాకాలం ఆరంభమై నెలరోజులు గడుస్తున్నా అనుకున్న స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని మండలాల్లో వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఇప్పటికే వరినారు పోసుకొని సిద్ధం చేసుకున్నారు. కానీ ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆకాశంపైపు ఆశగా చూస్తున్నారు. గడచిన వారం రోజులుగా జిల్లాలో ఎండల తీవ్రలేకపోయినా గుబురు ఎండతో జనం ఉక్కపోతకు గురై ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం జిల్లా కేంద్రం అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాలతో పాటు పలు మండలాల్లో జల్లులు కురిశాయి.

వేతన బకాయిలు చెల్లించండి

▸ సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన


ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు

నర్సీపట్నం, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించి, సమ్మె అగ్రిమెంట్‌ని అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు పూడి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ అబ్జర్వేషన్ కార్యక్రమం సందర్భంగా భోజన విరామ సమయంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తమకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వేజ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. మే, జూన్ నెల జీతాలు మంజూరు చేసి, సమ్మె అగ్రిమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుకి కమిటీ ఏర్పాటు, అన్ని విభాగాలకు ఎంటీఎస్ అమలు చేయాని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ రమేశ్, జి చిరంజీవి, అప్పారావు, జ్యోతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై సమగ్ర సర్వే



సబ్బవరం, జూలై 10 : ప్రభుత్వ భూమి హద్దులు మార్చి, కబ్జా చేశారన్న ఫిర్యాదు మేరకు జిల్లా సర్వేయర్ ఎస్.రాజగోపాలరాజు బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సబ్బవరం, అనకపల్లి, గొటివాడ గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సబ్బవరం సర్వే నెంబరు 271లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆమె వెనువెంటనే స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టారు. సదరు భూముల మ్యాప్‌లను జిల్లా సర్వేయర్ పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

'పేట'లో చెలరేగిన దొంగలు

▸ ఐదు షాపుల తాళాలు పగులగొట్టి సొత్తు పట్టుకెళ్లిన చోరులు
▸ విధులు ముగించుకుని వస్తున్న హెటెరో ఉద్యోగిపై దాడి


చోరీకి గురైన పాన్‌షాపులు


దొంగలు తొలగించిన గొండెం, ఐరన్ లాక్

పాయకరావుపేట, జూలై 10 : పట్టణంలో మంగళవారం రాత్రి దొంగలు చెలరేగిపోయారు. ఐదు షాపుల తాళాలు పగులగొట్టి దొరికినకడకు దోచుకుపోయారు. అంతేకాకుండా అర్ధరాత్రి విధులు ముగించుకుని నుంచి వస్తున్న హెటెరో కంపెనీ ఉద్యోగిపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... పాయకరావుపేటలోని మంగవరం రోడ్డులో గల జడ్పీ బాలికోన్నత పాఠశాల ఎదుట నుంచి రెండు పాన్ షాపుల తాళాలను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. చిల్లర నోట్లు, సామాన్లు పట్టుకుపోయారు. అదేవిధంగా సమీపంలో ఉన్న మాల్ ఎదుట తాళాలు విరగ్గొట్టి ఐస్‌క్రీమ్‌లు, డ్రింక్‌లు పట్టుకెళ్లారు. మెయిన్‌రోడ్డులోని గౌతమ్ స్కూల్ ఎదుట టీ టైమ్, పక్కనే ఉన్న మిల్క్ పార్లర్ షట్టర్ల తాళాలు విరగ్గొట్టి చోరీకి ప్రయత్నించారు. అయితే వాటిలో పెద్దగా వారికి ఏమీ దొరకలేదు. అదేవిధంగా హెటెరో కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి విధులు ముగించుకుని అర్ధరాత్రి మంగవరం రోడ్డులో ఇంటికి వెళుతుండగా నలుగురు ఆకతాయిలు వెంబడించి దాడిచేశారు. గంజాయి బ్యాచ్ రాత్రిపూట తిరుగుతూ పట్టణంలో దొంగతనాలు, ఒంటరిగా వస్తున్నవారిపై దాడిచేసి దోచుకుంటున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా జరిగిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందకపోయినా విషయం తెలుసుకుని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, హెటెరో ఉద్యోగిపై దాడిచేసిన వారిని గుర్తిస్తున్నామన్నారు. అదేవిధంగా జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద జరిగిన పాన్ షాపులో దొంగతనాలకు సంబంధించి పాఠశాల ఎదుట ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఇకపై పట్టణంలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

వాడీవేడిగా 'పేట' మండల సమావేశం

» సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
» రెవెన్యూ, ఉపాధి హామీ, పంచాయతీ శాఖల పనితీరుపై అసంతృప్తి
» ఉచిత ఇసుకపై టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న శ్రీరాంపురం సర్పంచ్ కృష్ణప్రసాద్

పాయకరావుపేట, జూలై 10 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన పాయకరావుపేట మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఉచిత ఇసుకపై వైసీపీ, టీడీపీ సర్పంచ్‌ల మధ్య కొద్దిసేపు వాగ్వావాదం జరగడంతో సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ, ఉపాధి హామీ పథకం అధికారులు మాట్లాడుతున్న సమయంలో శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ లేచి మాట్లాడుతూ శ్రీరాంపురం, రాజగోపాలపురం గ్రామాల మధ్య రైతులకు ఉపయోగపడే పుంతరోడ్డును అభివృద్ధి చేయడం కోసం సర్వే చేయాలని తహసీల్దార్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదేవిధంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మాట్లాడుతుండగా మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఇటీవల జరిగిన సామాజిక తనిఖీల్లో సుమారు రు.కోటి వరకు నిధుల దుర్వినియోగం అయ్యాయని నిర్ధారించిన అధికారులు వాటిని రూ.తొమ్మిది లక్షలకు తగ్గించేయడం ఏమిటని ప్రశ్నించారు. 2019 నుంచి మండలంలో జరిగిన ఉపాధి పనులపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంపీటీసీ సభ్యులు కశింకోట సత్తిబాబు, ఎం.రమాకుమారి తదితరులు మాట్లాడుతూ పాయకరావుపేటలో వీధి దీపాలు వెలకపోయినా పట్టించుకునేవారు లేరని, దుర్గాకాలనీలో పైపులైన్ పాడై ఏడాదిగా నీరు వృథా పోతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారని వాపోయారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతున్న సమయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దుర్గాకాలనీలో బెల్టు షాపులు నిర్వహిస్తుండడంతో రాత్రి నుంచి తెల్లవార్లూ మందుబాబులు వచ్చి వీరంగం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు హౌసింగ్ ఏఈ మాట్లాడుతున్న సమయంలో వైసీపీకి చెందిన పీఎల్‌పురం సర్పంచ్ పడాల సోమన్నదొర జోక్యం చేసుకుంటూ ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటూ టన్ను ఇసుకకు రూ.1225లు కట్టాలని చెబుతున్నారని, ఇది ఉచితం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామన్నారని ఎప్పుడు చేస్తారని అన్నారు. దీంతో టీడీపీకి చెందిన వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు కూడా కాలేదని, అప్పుడే ఆరోపించడం సరికాదని అన్నారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. వీరికి పలువురు వైసీపీ, టీడీపీ ప్రజాప్రతినిధులు తోడవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎంపీడీవో కలుగజేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఇదిలావుంటే, ఈ సమావేశంలో అధికారులు మైక్ ఏర్పాటు చేయకపోవడంతో తమకు ఏమీ వినిపించడం లేదని పలువురు సభ్యులు వాపోయారు. ఎంపీడీవో కె.స్వప్న, మండల పరిషత్ కార్యాలయం ఏవో వర్మతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులుపాల్గొన్నారు.

రాంకీలో ఇంటి దొంగలు

... 5వ పేజీ తరువాయి

దర్శనమిస్తున్నప్పటికీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేవలం రసాయన వ్యర్థాల నమూనాలు తీసుకుని చేతులు దులిపేసుకుంటుండడంపై స్థానికులు మండి పడుతున్నారు. పీసీబీ అధికారులకు మామ్మూళ్లు అందడం వల్లే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ఫార్మాసిటీ లోపల నుంచి వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

ఇంజక్షన్..రియాక్షన్

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. రియాక్షన్ వచ్చిన రోగుల్లో ఐదుగురు చిన్నారులు ఉండడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందారు. బుధవారం ఉదయం నాటికి వారి పరిస్థితి నిలకడగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అస్వస్థతకు గురైన రోగులు వీరే...

ఇంజక్షన్లు వికటించడంతో అస్వస్థతకు గురైన వారిలో సీతంపాలేనికి చెందిన కె.శ్రీను (25), కె.సింహాచలం (44), జానకయ్యపేటకు చెందిన డి.వీర్రాజు (52), డి.నూకరాజు (85), డి.రమణ (45), చినదొడ్డిగల్లుకు చెందిన వి.అప్పారావు (40), న్యాయంపూడికి చెందిన వరహాలమ్మ (66), సారిపల్లివానిపాలేనికి చెందిన చినతల్లి (60), తిమ్మాపురానికి చెందిన సునీత (34), రేవుపోలవరానికి చెందిన అమ్మాజీ (35), గుర్రాజుపేటకు చెందిన కె.నూకాలమ్మ (75), జి.లలిత (16), గునిపూడికి చెందిన ఆర్.తాతారావు (51), ఆర్.దేవి (50), ఆర్.డి.బాబు (45), దొండవాకకు చెందిన కారే నాగమణి (45), బుచ్చిరాజుపేటకు చెందిన సింహాద్రి, కొర్రవానిపాలేనికి చెందిన భవానీ (8), చిన తీనార్లకు చెందిన కె.చరణ్ (3), డీఎల్‌పురానికి చెందిన బి.విశ్వ (4), నక్కపల్లికి చెందిన ఎస్.సాత్విక్ (5), ఉపమాకకు చెందిన కె.దివ్యశ్రీ (5), రేవుపోలవరానికి చెందిన వై.ఆదిత్య (8) ఉన్నారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పూర్తి

» నేడు దార్లపూడి వద్ద అక్విడెక్టు పరిశీలనకు రానున్న సీఎం » హెలీప్యాడ్ నుంచి మొత్తం ఏర్పాట్లపై ఆరా తీసిన మంత్రి, అధికారులు


వర్షంలోనే ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, డీఐజీ, ఎస్పీ


హెలీప్యాడ్ చదును, డాగ్‌స్క్వాడ్ తనిఖీ


పాఠశాలలో భోజనంపై ఆరా తీస్తున్న మంత్రి

ఎస్.రాయవరం, జూలై 10 : మండలంలోని దార్లపూడి వద్ద అక్విడెక్టును పరిశీలించేందుకు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్న తరుణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ దగ్గర నుంచి అక్విడెక్టు వరకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. డీఐజీ విశాల్ గున్నీ ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాలను సందర్శించారు. బుధవారం మధ్యాహ్నం కొద్ది సేపు వర్షం కురిసినప్పటికీ వర్షంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కలెక్టర్, డీఐజీ, ఎస్పీలు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించుకున్నారు. సీఎం దార్లపూడి పాఠశాల నుంచి అక్విడెక్టు వద్ద వరకు రానున్న నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను యంత్ర సహాయంతో తొలగించారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే రోడ్డుకు ఇరువైలా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ దారిపొడవునా భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

మధ్యాహ్న భోజనం బాగుంటుందా...

» దార్లపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రశ్నించిన మంత్రి అనిత

ఇదిలావుంటే, సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విడిచి పెట్టిన తరువాత ఇంటికి వెళుతున్న విద్యార్థినీ విద్యార్థులను కలిసి కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో మధ్యాహ్నం పెడుతున్న భోజనం బాగుంటుందా లేదా.. పుస్తకాల కిట్లు అందరికీ ఇచ్చారా లేదా అంటూ.. మంత్రి అనిత ఆరా తీశారు. బాగా చదువుకోవాలని సూచించారు. సీఎం ఏర్పాట్లను విచ్చేసేదుకు వచ్చిన మంత్రి వెంట నాయకులు యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, ఎస్.వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, పోలిశెట్టి శ్రీను ఉన్నారు.

తీరంలో హార్బర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే 'సుందరపు'


హార్బర్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 10 : పూడిమడకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన పూడిమడక తీరంలో హార్బర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్బర్ నిర్మాణంతో పాటు, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. గత టీడీపీ హయాంలోనే ఇక్కడ హార్బర్ నిర్మించాలని ప్రతిపాదించారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రూ.350 కోట్లు దీని కోసం కేటాయించారన్నారు. పనులు ప్రారంభించే సమయానికి వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ అంశం మరుగున పడినట్టు ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తిరిగి పనులు ప్రారంభమయాయన్నారు. ఇదిలావుంటే, ఏపీఐఐసీలో ట్రక్ పార్కింగ్‌కు ఏర్పాటుకు ఎమ్మెల్యే స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సురేష్ కుమార్, వివిధ విభాగాల అధికారులతో పాటు నాయకులు భైలపూడి శ్రీరామదాసు, జరపరెడ్డి నర్సింగరావు, మోటూరు శ్రీవేణి, మేరుగు బాపునాయుడు, ప్రవీణ్‌లతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో 'సాగర్ కవచ్'


తీరంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం, జూలై 10 : తీరప్రాంత రక్షణపై కేంద్ర రక్షణ బలగాలు, రాష్ట్ర పరిధిలో పని చేసే పోలీసులు ఎంతవరకు సంసిద్ధంగా ఉన్నాయనే విషయాన్ని తెలుసుకునేదుకు ఈ రెండు ప్రభుత్వాలు సంయుక్తంగా ఓ బృహత్కారాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఇక్కడి సువిశాలమైన పూడిమడక తీరంలో సాగర్ కవచ్ పేరిట ఈ కార్యక్రమం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా తీవ్రవాదులు తీరంగుండా భూభాగంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాలని భావిస్తే ఏవిధంగా ఎదుర్కొవాలి అనే అంశంపై మాక్ డ్రిల్లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భూభాగంలో ఉన్న బ్లూఫోర్స్ సముద్ర తీరంతో పాటు రోడ్డు మార్గంలో కూడా పోలీసులు సిబ్బందితో గస్తీని ఏర్పాటు చేశారు.

'ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు'


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గణపతిరావు

సబ్బవరం, జూలై 10 : ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడినవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.గణపతిరావు ఆదేశించారు.. బుధవారం కార్యాలయ సిబ్బందితో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురువుతున్నట్టు తెలుస్తోందన్నారు. అటువంటి వాటిపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడ ఆక్రమణలు జరిగినా వెళ్లి తొలగించాలన్నారు. పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు పూడి శేషు, అనంత్, రుక్మిణి, నూకరత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కశింకోట, జూలై 10 : మండల కేంద్రం కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో యాభై శాతం అడ్మిషన్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 120 సీట్లకు గాను 88 సీట్లు భర్తీ అయినట్టు ప్రిన్సిపాల్ కర్రి శివ తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన కంప్యూటర్ హెడ్ దామోదర్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నియమించారని తెలిపారు. ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, రమణ కుమార్, కె.శివరాం, బి.జగన్మోహిని, జనార్ధన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి'


శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో జీఎం తదితరులు

అచ్యుతాపురం, జూలై 10 : మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని సెయింట్ గోబిన్ జనరల్ మేనేజర్ శర్వణ్ కుమార్ అన్నారు. సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటైన బ్యూటీపార్లర్ శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం బ్యూటీ పార్లర్‌లకు మంచి డిమాండ్ ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో మహిళలు ఆర్థికంగా బలపడవచ్చన్నారు. అందువల్లే ఇక్కడ మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ శివప్రసాద్, జయతో పాటు యాభై మంది మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే 'వేచలపు' జన్మదినం


శ్రీరామూర్తికి బొకే అందిస్తున్న టీడీపీ నాయకులు

కోటవురట్ల, జూలై 10 : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే వేచలపు శ్రీరామూర్తి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని పాములవాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్‌కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, వేలచపు జనార్ధన్, భాస్కర రావు, బీకేపల్లి సర్పంచ్ లింగంనాయుడు, దాలినాయుడు, ఎంపీటీసీ పి.సూర్యారావు, సుంకర్ బాబ్జి, తిరుమలరావు, రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, పలివెలి కోటి, కాకర కుమార్, గండేడ లోవరాజు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

రాజవరంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, జూలై 10 : మండలంలోని రాజవరంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్లపై ఉన్న చెత్తచెదారాన్ని తొలగిస్తున్నారు. సర్పంచ్ గోసల అమ్మాజీ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పశుగ్రాసం పెంపుపై అవగాహన

కశింకోట, జూలై 10 : పాడి పశువులకు మేలైన పోషణ కోసం మొక్కజొన్న, జొన్న, అలచందలు, హైబ్రిడ్ నేపియర్, పిల్లి పెసర వంటి గ్రాసాలను పెంచుకోవాలని మండల పశు వైద్యాధికారి అల్ఫోన్స జార్జ్ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా బుధవారం వెదురుపర్తిలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. గడ్డి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో విక్రించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. సర్పంచ్ శనివాడ అరుణ, ఎంపీటీసీ రాము, కూటమి నాయకులు సందల నాయుడు, సగరపు నాయుడు, మేడిది నాయుడు, రమణ పాల్గొన్నారు.

పెదగుమ్ములూరు పాఠశాలలో ఫ్రెషర్స్ డే

ఎస్.రాయవరం, జూలై 10 : పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెషర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి దిశానిర్దేశం చేశారు. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు.

రైతులు మట్టి నమూనాలు సేకరించాలి

కశింకోట, జూలై 10 : తాళ్లపాలెం సచివాలయంలో ఖరీఫ్ పంట యాజమాన్యంలో మెళకువలపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏ శ్రీధర్, ఏవో పి.విజేతలు రైతులకు మట్టినమూనా పరీక్షల ద్వారా ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వాతావరణ పరిస్థితులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి తదితరాలపై అవగాహన కల్పించారు. ఏవోలు ఎం.స్వప్న, సిహెచ్.చిరంజీవి, ఏఈవో, వీఏఏ, సిబ్బంది పాల్గొన్నారు.





నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి 11.20 గంటలకు పోలవరం ఎడమ కాలువ వద్దకు చేరుకుంటారు. సుమారు అరగంటపాటు కాలువ పనులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని 11.55 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు వద్దకు వస్తారు. 12.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ ప్రాంతానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.35 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.50 గంటలకు పెదగంట్యాడ మండలంలో గల మెడ్‌టెక్ జోన్ మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.30 గంటల వరకు భోజన విరామం. 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వర్చువల్‌గా సీఐఐ సదస్సుకు హాజరుకావడంతో పాటు మెడ్‌టెక్ జోన్‌లో రెండు భవనాలు ప్రారంభించి అక్కడ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.50 గంటల నుంచి ఆరు గంటల వరకు ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో విశాఖ జిల్లాలో ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6.10 గంటలకు విమానంలో బయలుదేరి రాత్రి గన్నవరం వెళతారు.

పోలవరం ఎడమ కాలువ దశ తిరిగేనా?

... 5వ పేజీ తరువాయి

ఎంత మొర పెట్టుకున్నా కనీసం పైసా విదల్చలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఎక్కడికక్కడ నిలిపివేశారు.

చంద్రబాబు రాకతో చిగురిస్తున్న ఆశలు

చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉండగా ఈ పనులు బాగానే సాగినా, 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోలవరం ఎడమ కాలువ పనులు, దార్లపూడిలో అక్విడెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఎడమ కాలువ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో అక్విడెక్టు అరకొర పనులతో వృథాగా దర్శనమిస్తోంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రధానంగా సాగు, తాగునీటి వనరుల దుస్థితిపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గురువారం చంద్రబాబు పోలవరం ఎడమ కాలువ, అక్విడెక్టు పరిశీలించనున్న నేపథ్యంలో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కార్మిక సమస్యలపై మండలాల్లో ఆందోళన

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని నినాదాలు


అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జూలై 10 : ఉద్యోగ, కార్మికుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు నష్టం కలిగించే కొత్త కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అసంఘటితరంగ కార్మికులైన ముఠా, ఆటో, బిల్డింగ్, తోపుడుబళ్లు, మోటార్ తదితర కార్మికులకు పనిభద్రత కల్పించి ప్రభుత్వం ద్వారా సమగ్ర చట్టం చేయాలని, పంచాయతీ కార్మికుల వేతన బకాయి జీతాలు చెల్లించి, కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో వీవీ శ్రీనివాసరావు, అప్పలరాజు, భీశెట్టి అప్పారావు, అజయ్, ఎస్.సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్షురాలు అమ్మ, జిల్లా కమిటీ సభ్యులు ఉమా నారాయణమ్మ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. అనంతరం సీడీపీవో ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. అలాగే, సమస్యలు పరిష్కరించాలంటూ భవన నిర్మాణ కార్మికులు అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు ఎం.రమణ, కె.వి.కృష్ణ, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలన్నీ సమస్యలు పరిష్కరించాలని బజారు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయాధికారికి అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు తనూజ, కె.శాంతి, నాగరాజు, సాయిరాం తదితరులతో పాటు అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, ముఠా కార్మికులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బత్తుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సూర్యనారాయణకు అందజేశారు. అంగన్‌వాడీ కార్యక్తలు కె.రత్నం, ఎస్.తులసి పాల్గొన్నారు.

కోటవురట్ల : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీకార్యకర్తలు డిమాండ్ చేశారు. అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సీపీఎం మండల కన్వీనర్ జి.డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


పాయకరావుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్ల నినాదాలు



ఎలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద...

ఎలమంచిలి : వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకుడు సోమునాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, వీవోఏల సమస్యలపై ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్. రూపాదేవి, సీహెచ్ ఎల్ఎన్ రాజేష్, రమణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీ, ఆశా, వీఓఏ, వీఆర్ఏ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పరవాడ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసంఘటితరంగ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై స్పందించాల్సిందిగా కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వివిధ యూనియన్ల ప్రతినిధులు రమణి, వరలక్ష్మి, ఉమామహేశ్వరి, వరలక్ష్మి, ఆర్.శంకర్, పైడిరాజు, మాణిక్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

» ఎంపీడీవో ఉమామహేశ్వరి



పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, జూలై 10 : పండ్లతోటల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రైతులందరికీ ప్రభుత్వంనుంచి వచ్చే రాయితీలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆదేశించారు. వరహాపురంలో యర్రా అప్పారావు అనే రైతు పొలంలో గత ఏడాది వేసిన పండ్లతోటల మొక్కలను ఏపీవో సియ్యాద్రి నాగరాజుతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గత ఏడాది ఇదే రైతు పొలంలో పది ఎకరాల్లో పండ్ల తోటలు వేశామని, ఈ ఏడాది కూడా కొత్తగా మరో రెండు ఎకరాల్లో పండ్లతోటల మొక్కలు వేశామన్నారు. పండ్ల తోటల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నందుకు అప్పారావును ఎంపీడీవో అభినందించారు.

హెల్త్ సెంటర్లలో సక్రమంగా సేవలు : డీఐవో



వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఐవో

మాకవరపాలెం, జూలై 10 : మండలంలో ఉన్న హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు సక్రమంగా అందించాలని జిల్లా ఇమ్యూనేషన్ అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. బుధవారం మాకవరపాలెం పీహెచ్‌తో పాటు తామరం హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటరులో అందిస్తున్న సేవలతో పాటు అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఎప్పుడూ ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవిద్య, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ఊరకాలువ అక్రమణలపై సర్వే



రైతుల సమక్షంలో సర్వేచేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

రావికమతం, జూలై 10 : రెండు గ్రామాల ఆయకట్టు సాగునీరు అందించే కొత్తకోట ముంత మామిడి ఊర కాలువ అక్రమణలపై బుధవారం రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు గ్రామ పెద్దలు,ఆయకట్టు రైతుల సమక్షంలో జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ కాలువను గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సత్యనారాయణ అక్రమించి శాశ్వత కట్టడాలు చేస్తుండంపై గత నెలలో అధికారులకు స్థానికులు కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో అధికారులు కాలువను పరిశీలించి సర్వే చేయించి అక్రమణలు తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం మండల సర్వేయర్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కోనలోవ రాజు తదితరులతో పాటు కన్నంపేట, కొత్తకోట గ్రామాల ఆయకట్టు రైతుల సమక్షంలో అక్రమలపై సర్వే నిర్వహించారు. కాలువ ఎంతమేర అక్రమణలకు గురైంది గుర్తించి మార్కింగ్ చేశారు. ఈ కాలువ అక్రమణలను తొలగించి, కాలువలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా యంత్రాలు వెళ్లే వీలుగా గట్టుపై 10 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు.

నాణ్యమైన పశుగ్రాసంతో పశువులకు ఆరోగ్యం

» పశు సంవర్ధకశాఖ ఏడీ చిట్టినాయుడు



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, జూలై 10 : నాణ్యమైన పశుగ్రాసంతోనే పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తురువోలు గ్రామంలో బుధవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టినాయుడు మాట్లాడుతూ ఏక వార్షిక, బహు వార్షిక, పశుగ్రాస రసాలు, పశుగ్రాసం నిల్వ చేసుకునే విధానాల గురించి వివరించారు. అలాగే 77 శాతం రాయితీతో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద గడ్డి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో ఎంపీటీసీ బీళ్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పీటీ బాబు, పెదగోగాడ పశువైద్యాధికారి కె.రాఘవమ్మ, సిబ్బంది రాజేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తామరబ్బలో పరిశుభ్రతకు చర్యలు



కాలువల్లో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

దేవరాపల్లి, జూలై 10 : మండలంలోని తామరబ్బలో పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను యువకులు తీయించారు. సర్పంచ్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎల్.ఇంగన్న, టీడీపీ నాయకులు శెట్టి మంగరాజు, పైడిరాజు, మంగరాజు, రాజుబాబు, ఈశ్వరరావు తదితరులు పారిశుధ్య పనులు చేయించారు.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

» వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి
» అధికారులు, నేతల మధ్య సమన్వయం అవసరం
» సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారు



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి

మాడుగుల, జూలై 10 : మాడుగుల నియోజకవర్గ అభివృద్ధితో పాటు వ్యవసాయ రంగానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి మండలంలో జరుగుతున్న అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. మాడుగుల నియోజకవర్గం వ్యవసాయానికి చాలా అనుకూలమన్నారు. వరి, చెరుకు పంటలతో పాటు మామిడి, పామాయిల్ వంటి పంటల సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా సంక్షేమ పథకాలు వ్యవసాయ ఆధారిత కార్యక్రమాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులకు అందుబాటులో ఉండాలని పశువైద్య అధికారులకు బండారు సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడే స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్ అండ్ బీ అధికారులు అవగాహన లేకుండా రోడ్ల వేశారని, వచ్చే సమావేశం నాటికి జరిగిన తప్పులు సరిదిద్దుకోవాలని అన్నారు. జలజీవన్ పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆయా శాఖ అధికారులు వివిధ పనులు చేపట్టేటప్పుడు ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. త్వరలో పెన్షన్‌లు ఇచ్చేందుకు తరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా కోరడం జరుగుతుందని. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, జడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీను, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కాళీ ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట : ఆందోళన చేస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు



గొలుగొండ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



నాతవరం : ఆందోళన నిర్వహిస్తున్న అంగన్వాడీలు

మా సమస్యలు పరిష్కరించండి

కోర్కెల దినం పాటిస్తూ తహసీల్దార్ కార్యాలయాల ముందు అంగన్వాడీల ఆందోళన

బుచ్చెయ్యపేట, జూలై 10 : అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా తమ సమస్యలు సత్వర పరిష్కారించాలని కోరుతూ అంగన్వాడీ సిబ్బంది బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి, బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సు ప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, పింఛన్, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని తదితర 9 డిమాండ్లు అమోదించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ ధర్నాలో మండల సీఐటీయూ కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు, అంగన్వాడీ మండల సంఘం నాయకురాలు ఆది వరలక్ష్మి, జె.వెంకటలక్ష్మి, గొట్టివాడ చిలకమ్మ, శనివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశ, మధ్యాహ్నం భోజన అమలు సిబ్బంది, ఇతర కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఎం.మంగతాయారు, గొలుగొండ అంగన్‌వాడీల సంఘ అధ్యక్షురాలు సీహెచ్ భ్రమరాంబ, నాయకులు రొంగలి సత్య, భవానీ, జ్యోతి, రైతు సంఘం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కాలంటూ అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అసంఘటిత కార్మికులైన ముఠా, ఆటో బిల్డింగ్ తోపుడు బండ్లు, మోటారు తదితర కార్మికులకు పని భద్రత ప్రభుత్వం ద్వారా సమగ్ర చట్టం చేయాలన్నారు. మండల ఐద్వా కోశాధికారి సూర్యప్రభ, అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు ధనమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో..

నాతవరం : నాతవరంలో అంగన్వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు, సీఐటీయూ కమిటీ సభ్యురాలు ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి రాజేశ్వరి, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో..

రోలుగుంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవిచంద్రకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయకులు కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

... 5వ పేజీ తరువాయి

బయలుదేరి 11.20 గంటలకు పోలవరం ఎడమ కాలువ వద్దకు చేరుకుంటారు. సుమారు అరగంటపాటు కాలువ పనులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని 11.55 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు వద్దకు వస్తారు. 12.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ ప్రాంతానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.35 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.50 గంటలకు పెదగంట్యాడ మండలంలో గల మెడ్‌టెక్ జోన్ మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.30 గంటల వరకు భోజన విరామం. 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వర్చువల్‌గా సీఐఐ సదస్సుకు హాజరుకావడంతో పాటు మెడ్‌టెక్ జోన్‌లో రెండు భవనాలు ప్రారంభించి అక్కడ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.50 గంటల నుంచి ఆరు గంటల వరకు ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో విశాఖ జిల్లాలో ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6.10 గంటలకు విమానంలో బయలుదేరి రాత్రి గన్నవరం వెళతారు.

పోలవరం ఎడమ కాలువ దశ తిరిగేనా?

... 5వ పేజీ తరువాయి

ఎంత మొర పెట్టుకున్నా కనీసం పైసా విదల్చలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఎక్కడికక్కడ నిలిపివేశారు.

చంద్రబాబు రాకతో చిగురిస్తున్న ఆశలు

చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉండగా ఈ పనులు బాగానే సాగినా, 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోలవరం ఎడమ కాలువ పనులు, దార్లపూడిలో అక్విడెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఎడమ కాలువ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో అక్విడెక్టు అరకొర పనులతో వృథాగా దర్శనమిస్తోంది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రధానంగా సాగు, తాగునీటి వనరుల దుస్థితిపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గురువారం చంద్రబాబు పోలవరం ఎడమ కాలువ, అక్విడెక్టు పరిశీలించనున్న నేపథ్యంలో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

లేబర్ కోడ్స్‌ని తక్షణమే రద్దు చేయాలి

కేంద్ర విధానాలను తప్పుపడుతూ కార్మికుల నిరసన



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

నర్సీపట్నం, జూలై 10 : కార్మికుల హక్కులను హరించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం గేటు ముందు కోర్కెల దినం పిలుపులో భాగంగా ధర్నా చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్మికులు, ప్రజా సంఘాలతో నిరసన, అబీద్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ మార్చేసి కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే భవిష్యత్తులో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సంఘాలు పెట్టుకునే హక్కులు కోల్పోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ గౌరీ, అంగన్‌వాడీల సంఘం నాయకురాలు సామ్రాజ్యం, రమణమ్మ, ఈశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ : ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు.వివిధ సంఘాల నాయకులు మేరపురెడ్డి జానకి, బి.ఉమ, రామలక్ష్మి, కమలకుమారి, కామాక్షి సత్యవతి, సూరిబాబు, గోవిందమ్మ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం : సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు వెంటనే కృషిచేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు హెచ్‌డీటీ మురళీధర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యవేణి, భోజన పథకం కార్యదర్శి కె.పార్వతి, వెలుగు యూనియన్ అధ్యక్షురాలు గంజి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల : ఎన్నికల ముందు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. బుదవారం స్థానిక గాంధీపార్కు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో నారం కొండాజీ, వీవోఏల యూనియన్ అధ్యక్షురాలు బత్తుల గంగా భవాని, కార్యదర్శి జగదీశ్వరి, ఈశ్వరరావు, పైడినాయుడు, తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ, కార్మికుల, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ మండల నాయకుడు బి.టి.దొర, లీల, జి.వరలక్ష్మి, చిన్నమ్మలు, గౌరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్..రియాక్షన్

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. రియాక్షన్ వచ్చిన రోగుల్లో ఐదుగురు చిన్నారులు ఉండడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందారు. బుధవారం ఉదయం నాటికి వారి పరిస్థితి నిలకడగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అస్వస్థతకు గురైన రోగులు వీరే...

ఇంజక్షన్లు వికటించడంతో అస్వస్థతకు గురైన వారిలో సీతంపాలేనికి చెందిన కె.శ్రీను (25), కె.సింహాచలం (44), జానకయ్యపేటకు చెందిన డి.వీర్రాజు (52), డి.నూకరాజు (85), డి.రమణ (45), చినదొడ్డిగల్లుకు చెందిన వి.అప్పారావు (40), న్యాయంపూడికి చెందిన వరహాలమ్మ (66), సారిపల్లివానిపాలేనికి చెందిన చినతల్లి (60), తిమ్మాపురానికి చెందిన సునీత (34), రేవుపోలవరానికి చెందిన అమ్మాజీ (35), గుర్రాజుపేటకు చెందిన కె.నూకాలమ్మ (75), జి.లలిత (16), గునిపూడికి చెందిన ఆర్.తాతారావు (51), ఆర్.దేవి (50), ఆర్.డి.బాబు (45), దొండవాకకు చెందిన కారే నాగమణి (45), బుచ్చిరాజుపేటకు చెందిన సింహాద్రి, కొత్రవానిపాలేనికి చెందిన భవానీ (8), చినదీనార్లకు చెందిన కె.చరణ్ (3), డీఎల్‌పురానికి చెందిన బి.విశ్వ (4), నక్కపల్లికి చెందిన ఎస్.సాత్విక్ (5), ఉపమాకకు చెందిన కె.దివ్యశ్రీ (5), రేవుపోలవరానికి చెందిన వై.ఆదిత్య (8) ఉన్నారు.

మధ్యాహ్న భోజ పథకం అమలులో అక్రమాలు

» వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు నరేష్



హెచ్ఎంతో మాట్లాడుతున్న నరేష్ తదితరులు

బుచ్చెయ్యపేట, జూలై 10 : వడ్డాది జడ్పీ హైస్కూల్ మధ్యాహ్న భోజన పథకం అమలులో అక్రమాలు జరిగాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించామన్నారు. రోజూ ఎంత మంది విద్యార్థులకు భోజనాలు తయారు చేస్తున్నారనే విషయం ఆరా తీశామన్నారు. హెచ్ఎం శేషగిరిరావుతో మాట్లాడి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నామన్నారు. హాజరు పట్టికలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు తయారు చేస్తున్న భోజనాలకు పొంతన లేనట్టు గుర్తించామన్నారు. అలాగే నాడు-నేడు పథకంలో చేపట్టిన అదనపు భవనాలకు విద్యుత్ సామగ్రి కొనుగోలులో అవకతవకలు జరిగినట్టు గుర్తించామన్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్నం భోజనాల నిర్వహణలో అక్రమాలు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తలారి శంకరరావు, వెంకటరమణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సొంత స్థలంలో జలజీవన్ రక్షిత మంచినీటి పథకమా?

» ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై టీడీపీ నేతల అసంతృప్తి

రావికమతం, జూలై 10 : గ్రామ సర్పంచ్‌తో కుమ్మక్కై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిబంధలకు విరుద్ధంగా పబ్లిక్ మినీ సోలార్ మంచినీటి పథకం చేపట్టారని గుడిప గ్రామ టీడీపీ నాయకులు ఆరోపించారు. దొప్పర్లవారి వీధికి తాగునీరు అందించేందుకు ప్రధాన మంత్రి జలజీవన్ పథకంలో భాగంగా రూ.7.5 లక్షలతో సోలార్ రక్షిత మంచినీటి పథకం మంజూరైంది. గ్రామస్థులకు అనువైన చోట కాకుండా సర్పంచ్ జిరాయితీ స్థలంలో ఈ పథకం బోరు, ట్యాంకును నిర్మించారని టీడీపీ నాయకులు మజ్జి అప్పారావు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు చాలా ఉన్నా సర్పంచ్ సొంత స్థలంలో ప్రభుత్వ పథకం నిర్మించడంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరును ఆయన తప్పుపట్టారు.

సంక్షిప్తంగా..

వరాహావతారంలో జగన్నాథుడు



చోడవరం, జూలై 10 : జగన్నాథుని రథోత్సవాల సందర్భంగా దశ రూప అవతారాల్లో భాగంగా బుధవారం స్వామి వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిబాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు

మాడుగుల, జూలై 10 : మాడుగుల కేంద్రంలో పురాతన దేవాలయం వేణుగోపాలస్వామి వారి ఆలయం వద్ద ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగులు వేయాలని ఆలయంలో భక్తులు, గ్రామపెద్దలు సమావేశమై తీర్మానించారు. ఈ నెల 13, 14 తేదీల్లో గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి వివరించడం జరుగుతుందన్నారు. వారికున్న వెసులబాటుతో ఎవరికి తోచినట్టుగా వారు ఇత్తడి సామాగ్రిని అందించవచ్చని పేర్కొన్నారు.

12న మండల సమావేశం

చీడికాడ, జూలై 10 : ఈ నెల 12న చీడికాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా రావాలని ఆమె కోరారు.

90 మంది నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాకవరపాలెం, జూలై 10 : శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మాకవరపాలెంలో విజన్-ఐ క్లినిక్ ఆప్టికల్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వంచారు. ఈ శిబిరంలో 90 మంది రోగులను పరీక్షించారు. వారిలో 65 మందికి శస్త్రచికిత్సలు చేసేందుకు శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గౌరీ, శివమనోహర్, నాయుడు, శంకర్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అశ్వనికుమార్ పాల్గొన్నారు.

23 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి

నర్సీపట్నం, జూలై 10 : ఏరియా ఆస్పత్రిలో వీఎస్ఎన్ వాట్సాప్ గ్రూప్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా 23 మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. బుధవారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. నర్సీపట్నానికి చెందిన వీరమాచినేని సందీప్ చౌదరీ గత ఏడాది కాలంగా వీఎస్ఎన్ వాట్సాప్ గ్రూప్‌లో ఉమ్మడి విశాఖ, కాకినాడ, విజయనగరం జిల్లాలోని దాతలను సభ్యులు చేర్చి రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నారు.సంవత్సరంలో 56 మందికి రక్తం దానం చేశారు. మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి సందీప్‌ని అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నూకాలమ్మ ఆలయం ఆశాదిపై దేవదాయ అధికారుల విచారణ



ఆలయం వద్ద విచారణ చేస్తున్న అధికారులు

కృష్ణాదేవిపేట, జూలై 10 : గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయం ఆశాది గేలకొండ త్రిమూర్తులుపై బుధవారం దేవదాయ శాఖాధికారులు విచారణ చేపట్టారు. తొలుత ఆసాది కుటుంబీకులు, దాతలను విచారణ చేశారు. ఈ సందర్భంగా యలమంచిలి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ త్రిమూర్తులు రాజకీయ ప్రమోయం ఉందన్న కారణంగాఅతన్ని ఆలయ ఆసాదిగా తొలగించి గేలకొండ కుటుంబీకుల్లో ఒకరైన గేలకొండ సత్యనారాయణను నూతన నియమించాలని, ఆలయ పునర్నిర్మాణంలో దేవదాయశాఖ నిబంధనలు పాటించకుండా దాతలు వద్ద నిధులు సేకరించి ఆలయంలో ఖర్చు చేశారని గేలకొండ శ్రీకాంత్ ఫిర్యాదు చేశారన్నారు. నిబంధనలు పాటించకుండా దాతలు వద్ద నిధులు సేకరించి ఖర్చు చేయడంపై ఆలయ అర్చకులు త్రిమూర్తులు నిబంధనలు పాటించలేదని తేలిందన్నారు. దీనిపై విచారణ నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

రాంకీలో ఇంటి దొంగలు

... 5వ పేజీ తరువాయి

దర్శనమిస్తున్నప్పటికీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేవలం రసాయన వ్యర్థాల నమూనాలు తీసుకుని చేతులు దులిపేసుకుంటుండడంపై స్థానికులు మండి పడుతున్నారు. పీసీబీ అధికారులకు మామూళ్లు అందడం వల్లే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ఫార్మాసిటీ లోపల నుంచి వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.